


(గత సంచిక తరువాయి)

"**రచితా! ఒక్క కృతిపాడమ్మా.** విని చాలా రోజులయ్యింది" అనసూయమ్మ హాల్లో దివాను మీద నడుం వాలుస్తూ అడిగింది.

దుర్గాపురంలో వున్నప్పుడు రచిత ఆరుసంవత్సరాలు శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. తీరిగ్గా వున్నప్పుడు అనసూయమ్మకి మనవరాలి చేతపాడించుకోవడం అలవాటే.

రచిత కుర్తాని మోకాళ్ళదాకా లాక్కుని బాసింపట్టు వేసుకుని కూర్చుంది.

"మహాగణపతిం మనసా స్మరామి...

మహా గణపతీం..." ముత్తుస్వామి దీక్షితుల కృతి అందుకుంది. నాజూకైన వేళ్ళు తాళం వేస్తున్నాయి.

ఆమె గొంతులోని మాధుర్యం గాలిలో అలలుగా తేలి వస్తుంటే అప్పుడే గుమ్మంలోకి అడుగుపెట్టిన శకుంతలాదేవి నిశ్చలంగా వుండిపోయింది.

అభీ కాలింగ్ బెల్ కొట్టవద్దని వారించి, తన దగ్గరున్న స్పేర్ కీతో తలుపుతీశాడు. శకుంతలాదేవిని చూసి పాట ఆపేయబోయిన రచితని వద్దన్నట్టు కళ్ళతోనే వారించాడు.

"చాలా బాగా పాడావమ్మా!" పాడడం పూర్తవుతూనే, మెచ్చుకుంది శకుంతల.

"దుర్గాపురంలో ఆరేళ్ళపాటు, చెరుకూరి విశ్వనాథశాస్త్రిగారి వద్ద సంగీతం నేర్చుకుంది" అనసూయమ్మ మనవరాలి గురించి గర్వంగా చెప్పింది.

"ఈవిడ మా అమ్మ శకుంతలాదేవి" అభీ పరిచయం చేశాడు. రచిత శకుంతలాదేవి నమస్కరిస్తే, శకుంతలాదేవి అనసూయమ్మకు చేతులు జోడించింది.

"ఈ అమ్మాయి రచిత, వాళ్ళ అమ్మమ్మ అనసూయమ్మగారు" పరిచయం పూర్తిచేశాడు.

"దుర్గాపురం అనసూయమ్మగారంటే పరమేశ్వరరావుగారి భార్య."

"అవును" అనసూయమ్మ అంది.

శకుంతలాదేవి మొహం విప్పారింది.

"అభీ వాళ్ళ పెదతాతగారిది దుర్గాపురమే. ఆయనకు పిల్లలు లేరు. ఆ ఆస్తిపాస్తులు కూడా మావారే చూసుకునేవారు. దుర్గాపురంలో పొలాలు, తోటలు చూసుకోవడానికి వచ్చినప్పుడల్లా మీ యింట్లోనే దిగేవారుట. ఎప్పుడూ చెబుతూ వుండేవారు. ఇప్పుడవన్నీ లేవనుకోండి. మీ గురించి వినడం తప్ప చూడలేదు. యిన్నాళ్ళకి యిలాగ అనుకోకుండా కలుసుకున్నాము"

"అంటే..శ్యాంగోపాల్..!?"

"అవునండి.. మావారు.."

"అభీ శ్యాంగోపాల్ కొడుకా?" ఆశ్చర్యం, ఆనందం కలగలిపిన గొంతుతో అంది.

పాతపరిచయాలు తోడవడంతో మరింత అభిమానంగా ఒకరి విషయాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు.

రచిత కాఫీ కలిపి తెచ్చి యిచ్చింది.

"అయితే, అప్పుడు మా వారికి యిప్పుడు మా అబ్బాయికీ ఆతిథ్యం యిచ్చారన్నమాట. మావాడు యిన్నాళ్ళూ ఎవరింట్లోనో వున్నాడనుకున్నాను. అందుకు కృతజ్ఞతలు తెలుపుకుందామనే యివ్వాళ బయల్దేరి వచ్చాను. అది మీరేకావడం సంతోషంగా వుంది." శకుంతలాదేవి అంది.

"ఎవరికెక్కడ ఋణమో ఎవరు చెప్పగలరమ్మా?"

"మావాడు చేసిన ఆకతాయి చేష్టలు అన్నీ చెప్పాడు. మీ మనవరాలు మంచితనం, ఓపిక గురించి కూడా అర్థమైంది" అంది రచిత వైపు ఆపేక్షగా చూస్తూ.

"అభీని మాత్రం తక్కువ చేసి చెప్పగలమా. మంచి పిల్లవాడు" అనసూయమ్మ అంది.

అభీ రచిత వైపు చూసి కొంటెగా కళ్ళెగరేశాడు.

రచిత గమనించనట్టే ఖాళీ కాఫీ కప్పులు, తిరిగి ట్రేలో సర్దుకోసాగింది.

"మీకు తెలియనిదేముందీ అభీ మొండిపట్టుదల కలవాడు. అనుకున్నది సాధించేవరకూ వదలడు. వాడు కోరినట్టే యిక్కడే యింకో యిల్లు తీసుకున్నాము.

వెళ్ళేముందు వాడిని యింత అభిమానంగా చూసుకున్నవారిని, చూసి వెళదామని వచ్చాను.

మా అన్నయ్య కూడా కాస్త దిగివచ్చాడు. అభీ బిజినెస్‌లో పెట్టుబడి పెడతానని అంటున్నాడు కూడా.

"త్వరలోనే అన్నీ పరిస్థితులు చక్కబడతాయని నా ఆశ" అంది నిట్టూరుస్తూ.

అభీ వెళ్ళిపోతున్నాడనగానే, రచితకి ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. అప్రయత్నంగా కళ్ళలోకి నీళ్ళు వుబికి వచ్చాయి.

అభీ కోసం చూసింది. అతను హడావిడిగా మేడమీద గదిలోకి వెళుతూ కనిపించాడు.

శకుంతలాదేవి ఫోన్ రింగ్ యివ్వడంతోనే, వారితోబాటు వచ్చిన మనిషి, అభీ వెనకాలే మేడమీదకు వెళ్ళాడు.

అరగంటపాటు అతను మేడదిగి రాలేదు. లాప్‌టాప్‌లు, కాగితాలు సర్దుకుంటూ వున్నాడు.

అదే తన జీవిత ధ్యేయం అన్నట్టుగా పాక్ చేసుకుంటూ వుంటే రచితకి కోపం, బాధ కలగలిపి వచ్చాయి.

పెరటి గుమ్మం దగ్గర చతికిలబడి, చేతిలోకి చిన్నరాయిని తీసుకుని, మెట్లమీద దాన్ని నేలకి రాస్తూ కూర్చుంది.

"ఆ రాయిని పూర్తిగా అరగదీస్తే నిన్ను గిన్నీస్ బుక్‌లోకి ఎక్కిస్తానన్నారా?" నవ్వుతూ, వచ్చి పక్కన కూర్చుంటూ అన్నాడు అభి.

రచిత గడ్డాన్ని మోకాలిపైన ఆనించి, తన పని అదేనన్నట్టు దీక్షగా రాయిని అరగదీస్తూ వుంది.

"మాట్లాడవేం. కోపం వచ్చిందా?"

"...."

మాదీ దుర్గాపురమే అని తెలిస్తే సంతోషిస్తావనుకున్నాను కానీ, కోపం ఎందుకు వచ్చిందో తెలియడం లేదే" కవ్వింపుగా అన్నాడు.

"నాకేం కోపం లేదు" విసుగ్గా అంది.

"సరే అయితే నేను బయలుదేరాలి." అంటూ లేచి నిలబడ్డాడు.

"ఈ నాలుగు రోజుల్లోనే మనం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. మన ఫ్రెండ్షిప్ యిలాగే కంటిన్యూ అవ్వాలి" మళ్ళీ అతనే అన్నాడు. రచిత తల ఎత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది.

"అంతకంటే చెప్పాల్సింది ఏమీలేదా?"

"మెసేజ్‌లు పెడుతూ వుండు, వీలైనప్పుడల్లా ఫోన్ చేయి" రచిత నిస్తేజంగా అయిపోయింది.

అతడింకేదో చెప్పాలని మనసుకి ఆరాటంగా వుంది. ఇద్దరి మధ్యా ప్రేమ వుందని గట్టిగా నమ్ముతుంది. కానీ సియానా?

అయోమయంగా అయిపోయింది రచిత.

"అన్నీ, అనుకూలంగా జరిగితే, త్వరలోనే మళ్ళీ మనం దగ్గరవుతామేమో" తనలో తానే మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు.

"కొన్ని రిలేషన్స్ స్వల్పకాలం మాత్రమే మనగలుగుతాయేమో. వాటిని హృదయంలో నిక్షిప్తం చేసుకుని జ్ఞాపకాలుగా మార్చుకుంటేనే కలకాలం మనగలుగుతాయి. అభీతో పరిచయం ఒక జ్ఞాపకంగానే మిగిలిపోతుందేమో" రచిత బాధతో సంబంధం లేకుండా పనులు చకచకా జరిగిపోతున్నాయి.

పైనుంచి అభీ బట్టలు,షూస్ పాక్ చేసి, కిందకి దించారు.

శకుంతలాదేవి రచితకి, అనసూయమ్మకి కానుకగా తెచ్చిన పట్టుబట్టలు చేతిలో పెట్టి, "మీకు ఏ అవసరం వచ్చినా, మేమున్నామని తప్పకుండా గుర్తుపెట్టుకోండి.." అని మరీ మరీ చెప్పింది.

శకుంతల చెప్పడంతో అభి, అనసూయమ్మ పాదాలకు నమస్కారం చేశాడు.

"చల్లగా వుండు" అంటూ దీవించి దగ్గరకు తీసుకుంది అనసూయమ్మ. రచిత మనసు మొద్దుబారిపోయినట్టు వులుకూ - పలుకూ లేకుండా నిలుచుంది.

"వస్తాను" అంటూ రచిత చేతిని చేతిలోకి తీసుకుని వీడ్కోలు చెప్పాడు.

ఆమె చూస్తూ వుండగానే, సామాన్లన్నీ కారు డిక్కీలోకి చేరాయి. కారు కదిలింది. అభీ విండోలో నుంచి చేయి వూపాడు. క్షణాల్లో కారు కాంపౌండ్ దాటి, వీధిమలుపు తిరిగి రోడ్డు మీద అన్ని వాహనాల్లో ఒకటిగా కలసిపోయి దూరంగా కనిపించకుండా పోయింది.

అభీ ఎంత సైలెంట్‌గా, సడన్‌గా వచ్చాడో అలాగే వెళ్ళిపోయాడు.

"హే.. ఇవాళ కొత్త మేనేజర్ వచ్చాడు. పేరు సారంగ్. పూర్తి పేరు సారంగపాణి. తెలుగువాడే" వార్త మోసుకొచ్చింది వసుధ.

అంతక్రితం దాకా వున్న మేనేజర్ మంచి ఆఫర్ రావడంతో వారం క్రితమే జాబ్ మానేసి వెళ్ళాడు.

"సో. ఇక నుంచి సారంగ్‌తో కలిసి పని చేయాలన్నమాట" రచిత అంది.

"ఈ మధ్య ఆఫీసులో ఎక్కువగా పనిలేదని బాధపడుతున్నావుగా మీ టీంకి. కొత్త ప్రాజెక్ట్ ఒకటి రాబోతుంది" మరో శుభవార్త చెప్పింది.

అభీ వెళ్ళిపోయాక నిజంగానే తోచడంలేదు. అతని గురించి ఆలోచిస్తే "తప్పు చేస్తున్నానా? సియానానే ముందుగా అతని లైఫ్‌లో వుందన్న విషయం ఎలా మరిచిపోయాను" అని బాధపడుతుంది.

దానికి తోడు ఆఫీసులో ఎక్కువగా పనిలేకపోవడం, అనవసరమైన ఆలోచనలకు దారితీస్తూ వుంది.

వసుధ చెప్పినట్టు కొత్త ప్రాజెక్టు వస్తే పనిలో బిజీ అయిపోవచ్చు. అనుకుంది.

"ఏమిటే నా మానాన నేను మాట్లాడుతూనే వున్నాను. ఎటో ఆలోచిస్తూ కూర్చున్నావు? ఈజ్ ఎవ్రిథింగ్ ఆల్‌రైట్?"

"నథింగ్ నేను బాగానే వున్నాను. డోన్ట్ వర్రీ"

"సరే. అయితే, సాత్విక్ ఈవినింగ్ మూవీకి ప్లాన్ చేశాడు. మల్టీప్లెక్స్‌లో మహేష్‌బాబు మూవీ నీకూ టికెట్ బుక్ చేయమంటాను. ఓ.కే.నా?"

"వద్దు.. వద్దు.. మీరు వెళ్ళిరండి"

"సరే. నీ యిష్టం" భుజాలెగరేస్తూ వెళ్ళిపోయింది వసూ.

"రండి రండి" అనసూయమ్మ వయసే వున్నావిడ తలుపు తీసి లోపలకు ఆహ్వానించింది.

రచిత, అనసూయమ్మ యిద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "లోగడ, రెండు మూడుసార్లు రామారావుని చూడడానికి యిద్దరూ వచ్చినప్పుడు ఈవిడ కనిపించలేదు. ఎవరై వుంటుందబ్బా" అనుకుంటూ.

"ఓ.. మీరా ఈ సమయంలో ఎవరై వుంటారా అనుకుంటున్నాను." లోపలి నుంచి వస్తూ మాలతి అంది.

"ఈ అమ్మాయేనా రచితా అంటే..." ఇందాకటి ఆవిడ రచిత వైపు చూస్తూ అంది.

"మా అమ్మ, రామాయమ్మ" మాలతి పరిచయం చేసింది. అనసూయమ్మకి ఈ పరిస్థితి యిబ్బందికరంగా వుంటుందేమో అని రచిత మనసులో బాధపడింది.

"ఇటు పిల్లల్ని, అటు ఆయన్ని చూసుకోలేక, తోడుగా వుంటుందని మా అమ్మని పిలిపించుకున్నాను." మాలతి చెప్పింది. మామూలుగానే రచితకి ఆ యింట్లో తను పరాయి మనిషినన్న భావం వుంది. ఇప్పుడు రామాయమ్మ ఎదురుగా వుండడంతో మాట్లాడాలన్నా సంకోచంగా అనిపించింది.

"అమ్మాయ్ కాస్త కాఫీ పట్టుకురా ఈ అమ్మాయి నీ యింటి ఆడబడుచు. ఆడబిడ్డ మనసు కష్టపెట్టకుండా చూసుకోవాలే తల్లీ" రామాయమ్మ మాలతిని పురమాయించింది.

రచిత ఆ మాటల్లో ఎంత నిజమో, ఎంత నాటకమో అర్థం కాలేదు. కానీ మాలతి పలకరింపులో మాత్రం చాలా మార్పు గమనించింది. "ప్రతినెలా ఠంఛనుగా ఆమె ఎకౌంట్‌లో పడుతున్న డబ్బు, జబ్బుతో బాధపడుతున్న భర్త ఆమె ఆలోచనల్లో మార్పు కలిగించి వుండవచ్చు" అనుకుంది.

"అక్కా" అంటూ తన్మయి వడిలోకి వచ్చి కూర్చుంది. ఇప్పుడిప్పుడే కొత్తపోయి దగ్గరవుతూ వుంది.

బ్యాగులో నుంచి డెయిరీ మిల్క్ చాక్లెట్ తీసి యిచ్చింది రచిత.

"ఈమె ఎవరు? నీతో వస్తూ వుంటుంది?" అంది అనసూయమ్మవైపు చూస్తూ.

"ఆమె నా అమ్మమ్మ."

"అంటే నాకు బామ్మవుతుందా? అమ్మమ్మవుతుందా?"

"నీకూ అమ్మమ్మే అవుతుంది."

కొంచెంసేపు అనసూయమ్మని పరీక్షగా చూసి దగ్గరకు వచ్చింది. ఆవిడ బుగ్గలు పట్టుకోబోతే పరిగెత్తుకుంటూ లోపలికి పారిపోయింది ఇంతలో, కాఫీలు పట్టుకొచ్చి యిచ్చింది మాలతి.

"మాలతీ" లోపల్నుంచి రామారావు కేకపెట్టాడు. హడావుడిగా అతని అవసరం చూడడానికి వెళ్ళిందామె. రామారావుకి కిమోథెరపీ మొదలు పెట్టాక అప్పుడప్పుడూ బట్టల్లోనే విరోచనం అవుతూ వుంటుంది.

మాలతే శ్రద్ధగా అతనికి సేవలు చేస్తూ వుంటుంది. ఒకటి, రెండు సార్లు రచిత గమనించిందా విషయం.

వాళ్ళిద్దరూ అన్యోన్యంగానే వుంటారన్న సత్యం కూడా బోధపడింది. అయినా, మనసులో మాలతి వున్న స్థానం తన తల్లికి లేదని గుర్తొస్తూనే వుంటుంది.

కాన్సరుతో పోరాడుతూ వున్నా తండ్రిని మన్నించలేకపోతుంది.

"అభీ చెప్పినట్టు పెళ్ళిచేసుకుంటే భర్త, పిల్లలు వారి ప్రేమతో మునిగి వీటన్నింటినీ మర్చిపోగలుగుతానా? క్షమించేంత పెద్దమనసు వస్తుందా?" రచిత ప్రశ్నించుకుంటూ వుంది.

రామారావు రచితని చూడడానికి హాల్లోకి వచ్చాడు. నీరసంగా వున్నాడేమో, మాలతి చేయిపట్టుకుని తెచ్చి కూర్చోబెట్టింది.

"ఇప్పుడెలా వుంది నాయనా?" అనసూయమ్మ అడిగింది.

"ఫర్వాలేదు. కోలుకున్నట్టే. కిమోకి శరీరం సహకరిస్తూ వుంది. ఇంకో మూడు నెలల్లో థెరపీ పూర్తవుతుంది", చూడడానికి మనిషి మాత్రం బలహీనంగా వున్నాడు. నెత్తిమీద జుట్టంతా రాలిపోయివుంది.

"నేను మాట్లాడడం బావుంటుందో లేదో అయినా, చెప్పాలనిపించి చెబుతున్నాను. రచితకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?" అడిగాడు. ఇంకో సందర్భంలో అయితే, రచితకి అతనలా అడగడం కోపం తెప్పించి వుండేదే కానీ ప్రస్తుత పరిస్థితులలో ఏమీ అనలేకపోయింది.

"నేనూ పెద్దదాన్ని అయిపోతున్నాను. రచిత పెళ్ళి చూడాలనే వుంది. ఎంతైనా, పీటల మీద కూర్చుని కాళ్ళు కడిగి కన్యాదానం చేయవలసినవాడివి నువ్వు. ముందు నీ ఆరోగ్యం కుదటపడనీ. తర్వాత ఆలోచిద్దాం" అనసూయమ్మ అంది.

"భగవంతుడి దయవల్ల నాకింకొక పది సంవత్సరాల ఆయుర్దాయం దొరికినట్టే అనిపిస్తుంది. నేను ఖచ్చితంగా కోలుకుంటాను. బాధ్యతలు తీర్చుకోడానికి యింకో అవకాశం దొరికినట్టే వుంది. అమ్మాయి ఎవరినైనా యిష్టపడితే సరే లేదంటే మీరే ఒక మంచి సంబంధం చూడండి" చెప్పాడు.

"హలో!! "

సీరియస్‌గా పనిచేసుకుంటున్న రచిత ఒక్కసారిగా వులిక్కిపడింది.

"సారీ మిమ్మల్ని భయపెట్టాలని రాలేదు" వెనకాల సారంగ్ నవ్వుతూ నిలబడివున్నాడు.

"ఓ. ఇట్స్‌యూ" రివాల్వింగ్ ఛెయిర్‌తో బాటూ వెనక్కి తిరిగింది.

"మొన్న మీ ప్రజంటేషన్ సూపర్బ్. క్లయింట్ యింప్రెస్ అయ్యాడు. సో ఈ ఫ్రైడే మీకు లంచ్ నా తరపు నుంచి. మీకు ఓ.కేనా?" మర్యాదగా అడిగాడు.

రచిత మొహం విప్పారింది. "ఒకే. ష్యూర్" అంది నవ్వుతూ.

సారంగ్ నెమ్మదస్తుడు. నిదానంగా, ఆచి తూచి మాట్లాడతాడు. అంత నెమ్మదిగా, సాఫ్ట్‌గా వున్నా పనులు ఖచ్చితంగా ఎలా చేయించుకోవాలో అతనికి బాగా తెలుసు.

అతని పనితీరుకి రచిత ఆశ్చర్యపోతూ వుంటుంది. అతనితో బాటు పనిచేసే ఆడవాళ్ళ పట్ల మర్యాదగా వుండే సారంగ్ అంటే రచితకి చాలా గౌరవం. అందువల్లనే అతను లంచ్ ప్రపోజల్ పెట్టగానే ఆలోచించకుండా "సరే"నంది.

"ఏంటీ, లంచ్ యిన్విటేషన్ నీకొక్కదానికేనా?" వసుధ కొంటెగా నవ్వుతూ అంది.

"నువ్వు ఎక్కువగా వూహించుకోకు. మొన్న ప్రజెంటేషన్ బాగా జరిగినందుకు, ఫార్మల్‌గా లంచ్... అంతే" అంది రచిత.

''అంతేలే వూహించుకుంటే మాత్రం జరిగేదేముంది? ఒక్క రూఫ్ కింద నాలుగురోజులు వున్న హాండ్సమ్‌నే అలా ఈజీగా వదిలేశావు. ఎన్నిసార్లు లంచ్‌కి తీసుకెళితే మాత్రం నువ్వు మారతావా?'' నిట్టూరుస్తూ అంది.

''నా సంగతి సరే నీ విషయం చెప్పు. సాత్విక్‌ని వదిలి ఇలా ఎందుకు వచ్చినట్టు?''

వసుధ మొహం సీరియస్‌గా మారిపోయింది.

''చెబుతా కానీ, యిక్కడ కాదు. పద కాఫీ షాపులో కూర్చుని మాట్లాడుకుందాం'' హ్యాండ్ బ్యాగ్ తగిలించుకుంటూ కుర్చీలో నుంచి లేచింది.

ఇద్దరూ లిఫ్ట్‌లో కిందకి దిగి ఆఫీస్ బిల్డింగ్ బయటకి వచ్చారు. ఆకాశం నిండా నల్లని మబ్బులు చల్లటిగాలి సన్నగా వణుకు పుట్టిస్తుంది.

చిటపటా చినుకులు పడుతూ వుంటే, తలమీద చేతులు అడ్డం పెట్టుకుని రోడ్డు దాటారు.

షాప్ అంతా కాఫీ ప్రియులకు సంబరం కలిగించే ఘుమఘుమలాడుతూ వుంది. బయట చలిగా వుండటంతో రద్దీగా కూడా వుంది.

గ్లాస్ వాల్ మీద పడుతున్న చినుకులను చూస్తూ వెచ్చటి కాఫీ సిప్ చేసి, తీరిగ్గా కుర్చీలో వెనక్కివాలింది రచిత.

అద్దం మీద పడ్డ ఒక్కొక్క నీటిబిందువు, ఒకదానితో ఒకటి కలిసి ధారలై సాగుతూ వుంటే...

అభీ జ్ఞాపకం వచ్చాడు.

బ్లూకలర్ మెర్సిడెజ్ కారులో నుంచి దిగుతూ బ్లూకలర్ షర్ట్, దానిమీద స్ట్రైప్స్ వున్న బ్లాక్ కలర్ టైతో.

''హే... అభినవ్'' ఒక్క క్షణం మనసు వుత్సాహంతో గంతువేసింది. వానకొద్దిగా జోరందుకోవడంతో రోడ్డుకి అవతలి పక్క దృశ్యాలు మసకబారాయి. రెప్పపాటులో అభీ మాయమయ్యాడు.

''ఇదంతా నిజమా? భ్రమా?'' అనుమానం వచ్చింది.

''నేను స్టోరీ చెబుదామని వస్తే, నువ్వు ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్ళిపోయావేం?'' నాప్‌కిన్స్ బొత్తి పట్టుకుని వచ్చి కూర్చుంటూ, రచిత మొహం మీద చిటికె వేసింది వసూ.

''ఇందాకే చెప్పాను. నా సంగతి వదిలేయమని. నీ స్టోరీ మొదలుపెట్టు'' అంది రచిత కాఫీ సిప్ చేస్తూ.

వసుధ మొహం గంభీరంగా మారిపోయింది.

''మొన్న సండే సాత్విక్ పేరెంట్స్‌ని కలిశాను. ఇంట్లో అందరూ బాగానే వున్నారు. కానీ, వాళ్ళమ్మను చూస్తేనే భయం వేసింది''

వసుధ ఎక్స్‌ప్రెషన్ చూసి రచితకి నవ్వొచ్చింది.

''ఆవిడ పాత సినిమాల్లో సూర్యకాంతం టైపా?''

''లేదు. సూర్యకాంతం టైప్ అయితే మొగుడ్ని ఈజీగా మనవైపు టర్న్ చేసుకోవచ్చు. కానీ, ఆవిడ అంజలీదేవి టైపు. ఓవర్ ఎఫెక్షన్. అదే భయం వేస్తుంది.''

రచిత ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టింది.

''చదువుకున్నదానివి నువ్వా యిలా ఆలోచిస్తావనుకోలేదు. మొగుడ్ని నీ వైపు తిప్పుకోవడం ఏమిటి? సాత్విక్‌కి ఒక వ్యక్తిత్వం వుంది. అతనికీ యిష్టాయిష్టాలు, అభిప్రాయాలూ, మూడ్స్ వుంటాయి. వాటిని గౌరవించు'' మందలిస్తున్నట్టుగా చెప్పింది.

''అదికాదే నా వుద్దేశ్యం ఏమిటంటే, ఆవిడ యిరవై ఆరేళ్ళ వ్యక్తిని యింకా చిన్నపిల్లవాడిలా చూస్తూ అతిప్రేమ కురిపిస్తూ వుంటే ఎలా వుంటుంది చెప్పు? అతను యిండిపెండెంట్‌గా, స్ట్రాంగ్‌గా వుండొద్దూ..''

"అమ్మ అలాగే వుంటుంది. ఐమీన్ అలాగే వుంటుందనుకుంటున్నాను." రచిత గొంతులో బాధ ధ్వనించింది.

సంభాషణ ఎటువైపుకి మళ్ళిందో అర్ధమైంది వసుధకి. "అదికాదు. నేననేదేంటంటే"

రచిత మధ్యలోనే అందుకుంది.

"నాకు అర్ధం అయ్యింది. సాత్విక్ ఆఫీసులో చూస్తున్నానుగా. ఇండిపెండెంట్‌గా, స్ట్రాంగ్‌గానే వుంటాడు. తల్లిప్రేమ యిప్పటివరకూ అతని కెరీర్‌ని అయితే ఎఫెక్ట్ చేయడంలేదు. ఇక పర్సనల్ విషయాలంటావా ముందు నుంచే నువ్వు నెగెటివ్‌గా ఆలోచించి భయపడుతున్నావేమో"

అసలు విషయం రాబట్టాలని కాజువల్‌గా అంది.

వసుధ కొంచెం తత్తరపడింది.

ఓ.కే. అసలు పాయింటు కొచ్చేస్తాను. ఒకసారి గట్టిగా గాలిపీల్చి టేబుల్ ముందుకి వంగింది.

"ఎందుకనో, పెళ్ళి అనుకోగానే నెర్వస్‌గా వుంది. ఇప్పుడు హాయిగా, స్వేచ్ఛగా బతుకుతున్నాను. సంపాదించుకుంటున్నాను. రేపు పెళ్ళి అయ్యిందనగానే బాధ్యతలు వస్తాయి కదా" అంది.

"అయితే, అసలు నువ్వు పెళ్ళికి రెడీనా, కాదా ఆలోచించు ముందు" సలహా యిచ్చింది రచిత.

"అదే అర్ధం కావడంలేదు. సాత్విక్‌తో లవ్, రొమాంటిక్ మూమెంట్స్ అన్నీ థ్రిల్లింగ్‌గానే వున్నాయి. కానీ, నిన్న సడన్‌గా వాళ్ళింటికి వెళ్ళేసరికి రియాలిటీ అర్ధమైంది. పెళ్ళవగానే అత్తగారు, మావగారూ ఆడబడుచు అలకలు, సాధింపులు, గొడవలు, పెళ్ళికి వెళ్ళడాలూ, పరామర్శలు, పిల్లలు ఫ్యూచర్ అంతా సినిమా రీలులా కనిపించి బుర్ర తిరిగి పోయిందనుకో. చాలా భయం వేసింది. వాళ్ళదీ మాలాంటి ఫ్యామిలీనే. కోడలు నుంచి ఏమి ఎక్స్‌పెక్ట్ చేస్తారో నేను వూహించగలను. వుద్యోగంలో వున్న వత్తిడి చాలక, ఈ స్ట్రెస్ కూడా మోయగలనా? ఇదంతా నాకవసరమా? అని ఆలోచిస్తున్నాను" వివరంగా విషయమంతా బయటపెట్టింది.

"అయితే యిప్పుడేం చేయాలనుకుంటున్నావు?"

"అది అర్ధంకాకనే కదా నీ సలహా అడుగుతూ వున్నాను."

రచిత కొంచెం సేపు ఆలోచించింది.

"పోనీ. పెళ్ళికి యింకా రెడీగా లేనని చెప్పేయ్ సాత్విక్‌తో" అంది

"అలా అంటే, నేను వాడి టైప్ కాదనుకుని, వేరే అమ్మాయిని వెతుక్కుంటే?"

"అంటే నువ్వు సాత్విక్‌ని డీప్‌గా లవ్ చేస్తున్నావనమాట."

"అఫ్‌కోర్స్ రచితా.. ఐ లవ్ హిమ్ వెరీమచ్."

వాస్తవాల్ని మనసు అర్ధంచేసుకోదు. మనసుని బట్టి వాస్తవ పరిస్థితులు మారవు. ఈ రెండింటికీ ఎప్పుడూ వైరుధ్యమే.

సియానాని చేసుకోబోయే వ్యక్తి అని తెలిసీ అభీని మర్చిపోలేకపోతున్నాను. అలాగని అతడు ఆమెకి అన్యాయం చేసినట్టనిపించినా మనశ్శాంతిగా వుండలేను తన పరిస్థితిని తల్చుకుని నిట్టూర్చింది రచిత.

"సాత్విక్ ఒక్కడే కావాలి. అతని ఫ్యామిలీ వద్దు అని చెప్పలేవు. అలా చెబితే అతని దృష్టిలో చీప్ అయిపోతావు."

"ఛ.ఛ. నాకలాంటి వుద్దేశ్యం కూడా లేదే కాకపోతే వెళ్ళినచోట ప్రేమాభిమానాలకి బదులుగా సాధింపులూ, ఆరళ్ళూ ఎదురైతే? అదే నా భయం కొత్తగా జాబ్‌తో బాటు యింకా స్ట్రెస్‌ని మూటగట్టుకుని శారీరకంగా, మానసికంగా సమస్యలు కొని తెచ్చుకోవడమా? అనే ఆలోచిస్తున్నాను."

"ఒకవేళ అలాంటి సమస్యలే ఎదురైతే సాత్విక్ నీకు తోడుగా వుంటాడని నమ్ము. అదృష్టం బాగోలేక పరిస్థితులు ఎదురు తిరిగాయే అనుకో 'మీ పాదాల దగ్గర యింతచోటు యివ్వండి' అని ఏడుస్తూ కూర్చునే రోజులు కావు కదా! అయినా, ప్రతిదీ నెగెటివ్‌గా చూడడం మానెయ్." వసుధ దీర్ఘంగా ఆలోచిస్తూ కణతలు నొక్కుకుంది.

స్నేహితురాలి మనసులో ఆలోచనలు ఎలా సుడులు తిరుగుతూ వున్నాయో గ్రహించగలిగింది రచిత. ఆత్మవిశ్వాసం దెబ్బతింటే, ప్రతివిషయం భూతమై భయపెడుతుంది. అభద్రతాభావం మంచితనాన్ని చూసే అవకాశం యివ్వకుండా, మనస్సంతా చీకటిమయం చేసేస్తుంది.

వసుధ మేనత్త పెళ్ళి తర్వాత పడ్డ కష్టాలు ఎంతటివారినైనా కదిలించివేస్తాయి. పిల్లలకోసం ముళ్ళకంపలాంటి సంసారాన్ని మోస్తూ శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు అనుభవించి చిన్నవయసులోనే చనిపోయింది. వసుధ మీద ఆ ప్రభావం వుండడం సహజమే. చిత్రం ఏమిటంటే, మగవాళ్ళతో బాటు, సాటి ఆడవాళ్ళను నమ్మడానికి భయపడే పరిస్థితిలో వుంది స్త్రీ అప్పుడూ యిప్పుడూ.

వసుధకి పెళ్ళంటే భయం. కానీ, వయసుకీ, ఆలోచనలకీ వైరుధ్యం. సంసారం అంటే బందిఖానా. కానీ, ప్రేమించే తోడుకావాలి. వాస్తవానికీ, వూహలకీ మధ్య దూరాన్ని అంచనా వేయలేక సతమతమవుతూ వుంది.

వసుధ మనసును సులభంగానే చదవగలిగింది రచిత.

నెమ్మదిగా ముందుకు వంగి వసుధ చేతిని మృదువుగా తాకింది.

"వసూ.. నువ్వు మంచిదానివి. నిన్ను యిష్టపడకుండా ఎవరూ వుండలేరు. నువ్వు బయపడేట్లు జరిగితే, సాత్విక్ నీకు తోడుగా వుంటాడని నమ్ము."

వసుధ మొహం మబ్బు వీడినట్టయ్యింది.

"బాగా చెప్పావు రచీ. కొద్దిరోజులు పెళ్ళిప్రస్తావన తేవద్దని చెబుతాను సాత్విక్‌కి. నాకున్న అనుమానాలూ, భయాలూ అన్నీ అతనితో షేర్ చేసుకుంటాను. మనసుకి ముసుగు వేసి నటించడం కంటే యిదే బెటర్. కొద్దిరోజులు టైం తీసుకుంటే నాకే ధైర్యం వస్తుందేమో" ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా చెప్పింది.

బిల్ పే చేసి యిద్దరూ బయటికి వచ్చారు.

హడావుడిగా కురిసిన వాన అంతలోనే వెలిసిపోయింది. ఒకటీ అరా చినుకులు మాత్రం రాలుతున్నాయి.

నీటిబిందువులు చక్కిలిగిలి పెట్టినట్టు మీద పడుతూ వుంటే, అభీతో కలిసి వాకింగ్‌కి వెళ్ళిన రాత్రి గుర్తొచ్చింది.

సన్నని కోటేరులాంటి ముక్కు, ఆకుపచ్చగా నీడలు తేలుతున్నట్టు వున్న గడ్డం అభీ ఊహలోకి రాగానే నిజంగా ఎదురుగా నిలబడ్డట్టయ్యింది.

రెండు అడుగులు ముందుకి వేస్తూనే, గబుక్కున చేయిపట్టి ఆపినట్టయ్యింది.

తలతిప్పి చూస్తూనే కళ్ళముందు అభినవ్. గబుక్కున చేయి పట్టుకోవడంతో, రచిత పింక్ చుడీదార్ దుపట్టా అతని చేతిని చుట్టుకుంది.

"పిలుస్తుంటే, వినిపించుకోకుండా వెళ్ళిపోతావేం?" నవ్వుతూ అడిగాడు.

వసూ రచితవైపు చూసి, కొంటెగా నవ్వి, "వస్తాను" అని వెళ్ళిపోయింది.

"మీరేమిటిక్కడ?" దుపట్టాని వెనక్కి లాగుతూ అడిగింది.

"మళ్ళీ మీరులోకి వచ్చావు"

"సారీ. నువ్వేంటిక్కడ?"

"షెరోనా టెక్" గురించి చెప్పాను కదా.."

అవునన్నట్టు తలాడించింది రచిత.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments